# సన్మానం - సోమంచి రామం



జగన్నాధం రోడ్డు మీద నడిచి వెళుతున్నాడు. అదేం మాటయ్యా!...రోడ్డు మీద నడవక ఆకాశంలో నడుస్తాడా?...నీళ్ళలో నడుస్తాడా? అని మీరు ఎదురు ప్రశ్నలేస్తూ నాకు అడ్డు తగిల్తే నేనేం చెప్పలేను-చెయ్యలేను. ఎందుకనంటే ఇటీవలికాలంలో మన ఆర్టీసీ బస్సులు అలాంటి ఘనకార్యాలు సాధిస్తున్నాయి కాబట్టి మీకలాంటి డౌటు జగన్నాథం విషయంలో కూడా రావడం అసహజమేం కాదు! కాని మీ సందేహాలకి, నా సమాధానాలనో మీ.ప్ర-నా.జ అనో ఓ రెండు పేజీలు లాగించేస్తూపోతే - సంపాదకుల కలం కత్తి ఖండించి పారేయకతప్పదు. సో అలాటివేమీ మీ మనసుల్లోకి రానీయకుండా-హాయిగా లేటెస్టు తెలుగు సినిమా చూస్తున్నంత ఆనందంగా అనుమానాలన్నీ వదిలేసి ముందుకు సాగండి...ఒక్క క్షణం ఆగండి. దారి మళ్ళాను కదా! పట్టాలు తప్పింది గూడ్సు బండైనా, పాసింజరైనా, ఎక్స్‌ప్రెస్సైనా మళ్ళీ లైన్లోకెక్కాల్సిందేగా! అందుకని ఆ...ఏమన్నారు?...జగన్నాథం రోడ్డు మీద నడిచివెళుతున్నాడు. ఒక్క జగన్నాథమే ఏం ఖర్మ? రోడ్డు మీద చాలామందే నడిచి వెళుతున్నారు. కాని జగన్నాథం నడక తీరే వేరు! నడుస్తూనే రోడ్డుపై పడున్న అరటి తొక్కల్ని, కంకరరాళ్ళను కాలితో రోడ్డు మార్జిన్‌లోకి తోసేయగల నేర్పుకలవాడు అతగాడు! నడకమాత్రం ఆగదు!...అదందరికీ సాధ్యం కాదండోయ్! కావాలంటే మీరూ ట్రై చేయండి. నడక ఆపకుండా వాటిని పక్కకు తోసేయగలరేమో! పొరపాటున కాలుజారిపడ్డా, లేక మరే ప్రమాదమైనా జరిగినా నాకేం పూచీలేదు స్మండీ! సరే అదలా ఉంచుదాం! అలా నడుస్తున్న జగన్నాథానికి ఎదురుగా సైకిలు రిక్షా - రిక్షామైకుసెట్టు రిక్షాకు లౌడు స్పీకర్లు-రికార్డు మోత-వస్తున్నాయి...ఠక్కున రికార్డు ఆగిపోయింది. రిక్షాలో కుర్రాడు రోడ్డుపైకి కరపత్రాల్ని విసిరేశాడు...ఇంతలో కేసెట్ పెట్టాడు...కరపత్రంలో ఉన్నదే కేసెట్లోంచి వినపడుతోంది. రోడ్డుపై పడ్డ కరపత్రాలు గాలికి అటూ యిటూ ఎగిరిపోతున్నాయి.

"నీ బాంచను దొరా!...నీ కాల్మొక్తా!" అంటోన్న ఒకనాటి కమతగాడిలా, "మీ పాద సేవ చేయని కరములు కరములే" అంటున్న చరణదాసిలా- ఓ కరపత్రం సరిగ్గా జగన్నాథం కాళ్ళ దగ్గరకొచ్చిపడింది. "ఛీ!...నా కాళ్ళొదులు...గాడ్దె కొడకా!" అంటూ విసిరికొట్టే కామందులా కాకుండా -"ప్రేయసీ-నాదాలు మున్సిపాలిటీ మట్టితో మురికిగా వున్నాయి. కాళ్ళంటుకోకు-" అంటూ చరణదాసిని చేతుల్తో పైకి లేవనెత్తిన పతి దేవుడిలా జగన్నాథం వంగి ఆ కరపత్రాన్ని పైకి తీసి చూశాడు.

'సన్మానసభ' అన్న పెద్ద హెడ్డింగుతో ముద్రించబడిన కరపత్రమది! దాన్ని చూడగానే జగన్నాథానికి ఆశ్చర్యం, ఆనందం-రెండూ కలిగాయి. ఎందుకంటే యిటీవలి కాలంలో ఆ ఊళ్ళో ఎవరికీ సన్మానం జరగలేదు కనుక ఆనందం కలిగింది. ఆ వెంటనే ఆశ్చర్యమూ కలిగింది. కారణం? సన్మానింపబడే వ్యక్తి ఆ ఊరివాడే అయినప్పటికీ తనకు తెలియకపోవడం. ఆ కర పత్రాన్ని మడిచి జేబులో పెట్టుకొని యిల్లు చేరాడు. తీరుబడిగా కూర్చుని ఆ కరపత్రాన్ని మళ్ళీ మళ్ళీ సావధానంగా చదవసాగాడు! చదవగా చదవగా అతనిక్కలిగిన ఆనందం, ఆశ్చర్యం రెండూ ఒక్కసారిగా ఆగ్రహంగానూ, ఆవేశంగానూ మారిపోయాయి. ఒళ్ళెరుగనంత కోపం వచ్చింది. ఇంతకూ ఆ కరపత్రమేమిటోనని కదూ మీ ఆతృత!-అందుకే తిలకించండీ!


"మహాశయులారా!...మన పట్టణ నడిబొడ్డున

...ల పంచాయితీ ఎంక్లేవ్ హాలులో ఈ రోజు సాయంత్రం అయిదు గంటలకు గొప్ప సాహిత్య సన్మానసభ జరగబోతోంది. ఆ సభలో మన పట్టణ వాస్తవ్యులైన వామనరావుగార్కి సన్మానము-బిరుదు ప్రదానోత్సవము జరుగుతుంది. కావున సాహిత్యాభిమానులెల్లరు విచ్చేసి సభను జయప్రదం చేయకోరుతున్నాము.'' ఇట్లు
-సా.సా.సాం.సం-స.స.సం!!

కరపత్రాన్ని ఆసాంతం చదివాక జగన్నాథానికి ఒళ్ళంతా చెమట్లు పట్టేశాయి. చేతిలోంచి కరపత్రం జారిపోయింది. ఆలోచన మొదలైంది. తనకు తెలియకుండా సాహిత్య సభ జరగడమా?...జరపడమా?...ఎంత అవమానం?...ఎంత పరాభవం?...అసలీ సన్మాన సభను తలపెట్టినదెవరు? ...సా.సా.సాం-సం.స.స.సం-! ఏమిటీ హ్రస్వ నామధేయం? ఏమిటి దీనర్థం?...ఎంత ఆలోచించినా అర్థం అంతుబట్టడం లేదు. చిన్నతనంలో లెక్కలు చెప్పిన మేష్టారు-కొ.వె, ప.వె, అ.వె- అంటూ నేర్పించారు! కొన్న వెల, పట్టే వెల, అమ్మకపు వెలలకు అవి హ్రస్వరూపాలు!...పెద్దయాక ఉద్యోగ బాధ్యతలలో-పూ.అ.భా-అంటే పూర్తి అదనపు బాధ్యత అని తెల్సుకున్నాడు...కాని ఈ సా.సా.సాం.సం.స.స.సం అంటే ఏమిటి? అర్థం కాని కొద్దీ పంతం పట్టుదల పెరిగాయి. ఇలాంటివి ఇంగ్లీషులో అయితే డిక్షనరీలో వివరాలుంటాయి. తెలుగులో యిలాంటి వాటికి వివరణ యిచ్చే ప్రయత్నం ఎవరూ చేయలేదింకా! పోనీ తానే ఎందుకు చేయకూడదూ!. ..ఆలోచించగా...ఆలోచించగా సాధించగలిగాడు!! సాహిత్యసభ కాబట్టి అందుకు సంబంధించిదే అయివుండాలని నిర్ధారణ చేసికొన్నాడు. సా-సాహిత్య, సా-సారస్వత, సాం-సాంస్కృతిక, సం-సంస్థ...!అక్కడాగిపోయింది. మళ్లీ ఆలోచన సాగింది. అవునూ! ఇలా మూడు రకాల సంస్థలున్నాయిగా! అందుకని, సం-అంటే సంస్థలు, స-సమష్టి, స-సమన్వయ, సం-సంఘం అని ఎందుక్కాకూడదూ! ఈ ఆలోచన రాగానే ఒక్కసారి అతని ఒళ్ళంతా గర్వంతో పులకరించిపోయింది. బ్రేవో జగన్నాథం-బ్రేవో-నీ సాహితీ పరిజ్ఞానానికివే నా జోహార్లు-అంటూ తనలో తానే పొంగిపోయాడు. కాని ఆ ఆనందం అట్టే సేపు నిలవలేదు. కారణం ఏమీలేదు! తన ఊళ్ళోనే ఉన్న ఆ వామనరావెవరో మాత్రం తెలియడం లేదు. ఎవరై ఉంటారాని తెలుసుకోవడానికి -ఆ పట్టణాన్నంతా ఒక్కసారి నఖశిఖ పర్యంతం తన మనో నేత్రాలతో పరిశీలన చేయసాగాడు.

ఆ పట్టణంలో మేడలున్నాయి. మిద్దెలున్నాయి. డాబాలున్నాయి. పెంకుటిళ్ళున్నాయి. పూరి గుడిసెలున్నాయి. మేడల్లో, డాబాల్లో సోఫాలు, కుర్చీలు, ఫ్రిజ్‌లు, టీవీలు, ఫోన్లు, కూలర్లతో పాటు ఖరీదైన మనుషులూ వున్నారు. పూరి గుడిసెల్లో నులకమంచాలు, మట్టి బొచ్చెలు, చింకి పాతలు, చిల్లి బిందెలతో పాటు బక్కచిక్కిన బడుగు జీవాలున్నాయి. ఊళ్ళో తారు రోడ్లున్నాయి. అఫ్‌కోర్స్... ఆ రోడ్ల నిండా గోతులుండి-ఆ గోతుల్లో నీళ్ళుండి-ఆ నీళ్ళతో పాదచారుల ధవళ వస్త్రాలపై బ్లాక్ అండ్ వైట్ టీవీ పిక్చర్స్ దర్శనమిస్తాయంటే అది వేరే విషయం. ఆ ఊళ్ళో పురాణ కాలం నాటి పుష్పక విమానాల్ని మరిపించేలా పరుగులెత్తే సిటీబస్సులూ వున్నాయి. అవి ఎక్కడ ఆగిపోతే అక్కడే అంతా కలిసి వాటిని తోసుకుపోగల ఓర్పు, నేర్పు గల మనుష్యులూ ఉన్నారు. ఇంకా వీధివీధికీ పంపులూ, లైట్లూ ఉన్నాయి. పంపుల్లో నీళ్ళు రావటం లేదనీ, వీధిలైట్లు వెలగటం లేదనీ వాటి మీద విసుక్కుని విరుచుకుపడితే పాపం నోరు లేని నిర్జీవాలు అవేం చేస్తాయి చెప్పండి (అదిగో!...అదేంటి?...నోరున్న నిర్జీవాలు కూడా ఉంటాయని అప్పుడే మీకు డౌటొచ్చింది కదూ! నాకు తెలుసు నా పాఠకుల మేధాశక్తి అపారమని. కాని ఏం చేయను చెప్పండి ''చచ్చిన శవాన్ని'' అని మేధావులే రాసేస్తుంటే చచ్చినట్లు నోరు మూసికొని ఊరుకుంటున్నామా లేదా? అదేంటి? అసలు జీవం పోయి జీవి చస్తేనే కదా శవమనేది-మరలాంటప్పుడు చచ్చిన శవాలు-బతికున్న శవాలూ ఉంటాయా అని అడగ్గలుగుతున్నామా? లేదు!...సో...ఇదీ అలాగనని సరిపెట్టుకోండి! ప్లీజ్...)అన్నట్లు ఆ ఊళ్ళోనూ పేవ్‌మెంట్లు అనే ఫుట్‌పాత్‌లూ వున్నాయి. బ్రహ్మపదార్థంలా అది బతికున్న వారి కంటికెక్కనపడవు! పగలల్లా అవి రకరకాల వస్తు విక్రయశాలలు-రాత్రిళ్ళు పశుపక్ష్యాదులతో సహా మానవ విశ్రాంతి నిలయాలుగా- ఉపకరించే ఆ పేవ్‌మెంట్ల కోసం దుర్భిణీ అదే మైక్రోస్కోపులాంటి దానితో వెతికినా వృథా ప్రయాసే తప్ప ప్రయోజనం మాత్రం శూన్యం.

అయ్యా!...ఇంకా ఆ ఊళ్ళో కవులున్నారు! భావకవులు, అహంభావకులు, బాలకవులు, పాలకవులు-పాపాల కవులు...యింకా ...రచయితలున్నారు.. రచయిత్రులున్నారు... కథకులున్నారు, నటులున్నారు, నటీమణులున్నారు. గాయకులున్నారు, గాయనీమణులున్నారు. నాయకులున్నారు, వినాయకులున్నారు. ఛోటా, బడా, ఉప, మాజీ, తాజా నాయకులెందరో వున్నారు. వర్తకులున్నారు...నర్తకులున్నారు. డాక్టర్లున్నారు, యాక్టర్లున్నారు. టీచర్లున్నారు...ఛీటర్లున్నారు. ఆ ఊళ్ళోనూ రీడర్స్ వున్నారు. అంటే కొంప తీసి ఆ ఊళ్ళో యూనివర్శిటీ వుందనుకునేరు! అయినా ఏం చెప్పగలం?...ఏ నాటికైనా ఆ ఊరికే ఓ యూనివర్శిటీ రాకపోతుందా? ఆ ఊళ్ళో రీడర్స్ అంటే పాఠకులన్నమాట. ఏ పత్రికా, ఏ మేగజైన్ స్వంతంగా కొనకుండా, ఒకే పత్రికను సామూహికంగా, ఏ ముక్కకాముక్క చింపకుండా, అంతా ఒకేసారి చదవగల సమర్థులన్నమాట! ఆ ఊరి రీడర్స్‌ను చూసే చాలా పత్రికలు కంపార్ట్‌మెంటల్ బైండింగ్ పద్ధతి ప్రవేశపెట్టి అధిక లాభాలు గడించాయని వినికిడి. ఇంకా ఆ ఊళ్ళో కథా రచయితలున్నారు. కథానికా రచయితలు, మినీ కథారచయితలు, పెద్ద కథారచయితలు, గొలుసు కథా రచయితలు, హాస్య కథా రచయితలు, అపహాస్య కథారచయితలు, శృంగార కథా రచయితలు, ఉత్తరాల



రచయితలు, కార్టూన్ రచయితలు, కాకా రచయితలు, కాపీ రచయితలు, వర్ధమాన రచయితలు, దిన దిన ప్రవర్ధమాన రచయితలు, వృద్ధ రచయితలు, కృద్ధ రచయితలు-ఇలా ఒకరేమిటి? రకరకాల సాహితీసేవకులున్నారు. అంతేనా! సాహిత్యసేవ పేరిట హోదాలో ఉన్న వ్యక్తులనాహ్వానించి, వారికి శాలువా కప్పి, సన్మానాలు చేసి, ఆ సన్మాన కార్యంతో పాటు స్వకార్యాన్నీ సాధించుకోగల సమర్థులూ వున్నారు. ఇంకా చాలా చాలా మందే ఉన్నారనుకోండి...వారందరి గురించి యిప్పుడు చెప్పడానికి వ్యవధి చాలదు.

ఇంతమందిలో ఆ పట్టణంలో కాగడా పెట్టి గాలించినా, జగన్నాథం మనోనేత్రాలకి, ఆ వామనుడెవరో అంతు పట్టక పోయేసరికి, అతని అజ్ఞానానికి అతనికే సిగ్గేసింది. అతనూ సాహిత్యసేవలో కొద్దోగొప్పో చెయ్యి తిరిగిన వాడు కాకపోయినా చెయ్యి కాల్చుకున్నవాడే కాబట్టి అతని గురువర్యులు రామకృష్ణమాచార్యుల గారు సెలవిచ్చినట్లు కాస్తో-కూస్తో కళాదురద కలవాడు కావటం చేత-ఈనాడు ఆ వామనరావెవరో తెలుసుకోలేకపోవడం అతనికి తల కొట్టేసినట్లైంది. అసలాయన పేరే ఎక్కడా వినలేదు!...ఒక్క కథగాని, ఒక్క కవిత గాని కనీసం ఒక్క ఆర్యాలేఖ గానీ ఆ పేరుతో ఎక్కడా ఏ పత్రికలోనూ చదవలేదే!...అలాంటిది ఆయనకు ఈ రోజు సాహిత్య సభలో సన్మానమా!...బిరుదు ప్రదానమా?..తనకు యివ్వకపోయారన్న దుఃఖంతో పాటు యిలాంటి ఊరూ పేరూ రాని లేని రచయితకు బిరుదు తగిలించి సన్మానం చేస్తున్నారంటే మరింత ఘోరావమానంగా తోచింది జగన్నాథానికి. ఏమైనా సరే...సాయంత్రం ఆ సభకు వెళ్ళి అక్కడే ఆయన గొప్పతనమేదో తెలుసుకోవాలనుకున్నాడు. సాయంత్రం ఎప్పుడవుతుందాని ఎదురు చూస్తూ నడుం వాల్చాడు.


తీరా మెలకువ వచ్చేసరికి సమయం సాయంత్రం ఆరుగంటలైపోయింది. "అయ్యయ్యో!...ఎంత పొరపాటైపోయింది...ఎంత నిద్రమత్తులో పడిపోయాను! ఓ నా భారతదేశమా! నావంటి సోమరి పోతుని మన్నించగలవాతల్లీ!" అని తనలో తనను నిందించుకుంటూ ముఖ ప్రక్షాళన గావించి, దుస్తులు వేసుకొని ఆ ఫంక్షను హాలు చేరుకున్నాడు జగన్నాథం. అయ్యా! ఏమని వర్ణింతును అచ్చటి కోలాహలము? ఆ హాలంతాయూ క్రిక్కిరిసి యున్నది. ఆ జన సందోహంలో జగన్నాథం ఎరుగున్న వ్యక్తులు గాని, జగన్నాథాన్ని ఎరుగున్న వ్యక్తులుగానీ ఎవరూ కనపడలేదు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా పరాయి ఊరి నుంచి తోలుకొచ్చిన కిరాయి ఓటర్లలా కనిపిస్తున్నారంతా. సమయపాలన తెలిసిన సా.సా.సాం.సం-స.స.సం వారు సభను సరియైన సమయమునకే ప్రారంభించినట్లున్నారు. హాలులోనికి ప్రవేశించ సాహసించలేక బయటే నిలబడ్డ జగన్నాథం చెవిలో లౌడ్‌స్పీకరులో మాటలు బాణాల్లా దూసుకొస్తున్నాయి.

"ఈనాడు మనం సన్మానించబోతున్న వామనరావుగారు నివురుగప్పిన నిప్పులాంటివారు- ఆకుచాటు పిందెలా మబ్బు చాటు చంద్రునిలా....నేతిబీరకాయలోని నేయిలా ఉంటారాయన! అడ్డమైన రాతలు, నానా చెత్తా రాసి పాఠకలోకాన్ని పాడు చేసి, భాషను ఖూనీ చేసి, సాహితీ క్షేత్రాన్ని సర్వనాశనం చేయకుండా ఉండగలందులకే ఈ వామనరావుగారు ఏ రచనా ప్రక్రియను చేపట్టలేదు. ఏమీ రాయకపోవడమే, ఆయన సాహితీలోకానికి చేసిన అపారమైన సేవ. ఆనాటి వామనుడు దైత్యలోక రక్షకుడైనట్లు, ఈనాటి ఈ వామనరావు సాహిత్య లోక రక్షకులైనారు. అందుకే ఆయనకు "సాహితీ క్షేత్ర సంరక్షకులు" అన్న బిరుదుతో సన్మానిస్తున్నాం" కరతాళధ్వనులు-జనం కోలాహలంతో సభ ముగిసిపోయింది. "అనవసరంగా తొందరపడి చెయ్యి కాల్చుకున్నానే కామాక్షీ! లేకపోతే ఈ సన్మానం..." అంటూ భార్య దగ్గర బోరుమన్నాడు జగన్నాథం. ❀

## పాపం ఐస్

ఐశ్వర్యారాయ్ సల్మాన్‌ఖాన్‌ని పెళ్ళి చేసుకోవడానికి సుముఖంగా లేదట. సరికొత్త ప్రియుడు షారూఖ్, కెరీర్ తనకు ముఖ్యమని ఐశ్వర్య అంటోంది. కానీ సల్మాన్ మాత్రం ఐస్‌ను వదిలే ప్రసక్తే లేదంటున్నాడు. ఐస్‌తో విసిగిపోయిన సల్మాన్ ఆమె కెరీర్‌ను నాశనం చేసి, ఎలాగైనా ఐశ్వర్యను దక్కించుకోవాలని ప్రయత్ని స్తున్నాడు. ఇంతక ముందు అజారుద్దీన్ రెండవ భార్య సంగీతా బిజిలానీతో కూడా ఇలాగే ప్రవర్తించాడట. పాపం ఐస్ ఇటు షారూఖ్, అటు సల్మాన్‌లతో వేగలేకపోతోందట.



ఆటవిడుపు
పిల్లల సచిత్ర మాస పత్రిక
అక్టోబర్ 2002 సంచిక
విడుదలయింది
మీ కాపీ కోసం
మా ఏజెంటుని
అడగండి